# జడేరులో బాల్య వివాహ ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం



**గంగవరం, పెన్ పవర్,ఫిబ్రవరి 3 :**గంగవరం మండలం జడేరులో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ కే. కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం--2006 నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండని బాలికలు, 21 సంవత్సరాలు నిండని బాలురు వివాహం చేసుకోవడం చట్టవిరుద్ధమని తెలిపారు.అలాగే అక్రమ సంబంధాలు పెట్టుకోవడం, ముఖ పరిచయం లేని వ్యక్తులతో వెళ్లడం వంటి చర్యలు తీవ్రమైన నేరాలని పేర్కొన్నారు.ఈ విధమైన తప్పులు చేస్తే ఇరు కుటుంబాలపై లక్ష రూపాయలకు మించి జరిమానా విధించడంతో పాటు, రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని వివరించారు. అయితే ఈ చట్టం ప్రకారం మహిళలకు జైలు శిక్ష ఉండదని, పురుషులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. బాల్య వివాహానికి గురైన బాలికలను బాలికల సదనాల్లో (హాస్టళ్లలో) ఉంచుతారని వివరించారు.బాల్య వివాహాల వల్ల బాలిక, బాలుడు చదువు, ఆర్థిక సహాయం, శారీరక అభివృద్ధి, కుటుంబ సంబంధాలు తదితర అంశాలలో తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్.ఎం. నూకరత్నం, ఉపాధ్యాయులు సత్య కిరణ్ రెడ్డి, అంగన్వాడీ టీచర్ వెంకయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు .

# తిరుమల లడ్డులో కొవ్వు ఆయిల్స్ కలిసాయన్న దానిపై ఎటువంటి విచారణ లేకుండా దుష్ప్రచారం సరికాదు. ఎమ్మెల్సీ ఇజ్రాయేల్



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 03:**తాడేపల్లిగూడెం మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ విచ్చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తిరుమల తిరుపతి లడ్డూలో కొవ్వు కలిసిందని వ్యాఖ్యలపై సిట్ నియమించిందని గుర్తు చేశారు. లడ్డూలో ఎటువంటి ఆవు, పంది, చేప ఆయిల్ కలవలేదని సిట్ తీర్పునిచ్చిందన్నారు. అప్పట్లో తిరుమల లడ్డులో కొవ్వు ఆయిల్స్ కలిసాయన్న దానిపై ఎటువంటి విచారణ లేకుండా దుష్ప్రచారం చేశారన్నారు. దీంతో దేశంలోని 140 కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసారన్నారు. ఇటీవల మాజీ సీఎం జగన్, వై వి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి రూ.250 కోట్లు కాజేసారని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. ఫ్లెక్సీలు తీసేయాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు సూచించారని, లేకుంటే తామే తీసేస్తామని హెచ్చరించారన్నారు. పరీక్షలను తొలగించే క్రమంలో వెళ్తున్న అంబటి రాంబాబుపై కర్రలతో దాడికి ప్రయత్నించడంతో పాటు దుర్భాషలాడారని ఆరోపించారు. ఈ క్రమంలో అంబటి రాంబాబు నోరు జారినట్లు గుర్తు చేశారు. అయితే, తన పొరపాటును రాంబాబు అంగీకరించారన్నారు. చంద్రబాబు , లోకేష్ డైరెక్షన్లో అంబటి రాంబాబు ఇంటిపై దాడి చేశారన్నారు. పోలీసుల సమక్షంలో జరిగిన ఈ దాడిని చూస్తే రాష్ట్రంలో అసలు పోలీసులు ఉన్నారా ? అనే అనుమానం కలుగుతుందన్నారు. కర్రలు, రాడ్ తీసుకొచ్చిన వారిపై కేసులు లేవని, అంబటి రాంబాబుపై కేసులు పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అంతటితో ఆగకుండా బీసీ నాయకుడు జోగి రమేష్ ఇంటిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ప్రశ్నిస్తున్న వారిపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. నాడు వంగవీటి మోహన్ రంగ ను తెలుగుదేశం పార్టీ చంపించిందని ఆరోపించారు. కాపు రిజర్వేషన్ల కోసం పాటుపడిన ముద్రగడ పద్మనాభంను అనేక చిత్రహింసలకు గురి చేసిందన్నారు. వైసీపీని అణగదొక్కాలని చూస్తున్నారని, బంతిని ఎంత గట్టిగా కొడితే అంత ఎత్తు పైకి లేస్తుందనే విషయాన్ని గుర్తు చేశారు. జగన్ పిలుపునిస్తే తాము రోడ్డెక్కే పరిస్థితి ఉందన్నారు. మీరు, మేము రోడ్డెక్కితే రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని కోరారు. కోర్టు సీరియస్ కావడంతో జోగి రమేష్ ఇంటిపై దాడి చేసిన వారిలో కొందరిని అరెస్ట్ చేసి స్టేషన్ బెయిల్ ఇవ్వడం దుర్మార్గం అన్నారు. కూటమి ప్రభుత్వం కాపులపై దాడులు చేస్తుంటే పవన్ కళ్యాణ్ నోరు విప్పడం లేదని విమర్శించారు. ఈ విషయంలో పవన్ కళ్యాణ్, కాపు సోదరులు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. లడ్డూ విషయంలో దొరికిపోయి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. రోడ్ ప్యాచ్ వర్కులకు బిల్లులు చేసుకుంటున్నారని, ఎక్కడైనా మరమ్మతులు చేసారా ? అని నిలదీసారు. నిరుద్యోగ భృతి ఇచ్చారా అని ప్రశ్నించారు. బీసీలకు 50 ఏళ్ళకే పింఛన్ అందిస్తామని చెప్పారన్నారు. జగన్ ప్రవేశ పెట్టిన రీ-సర్వేను అమలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి పేరుతో కేంద్రం నుంచి రూ.2.50 లక్షలు కోట్లు అప్పు తీసుకొచ్చారన్నారు. పేదలకు సెంటు భూమి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. వైసీపీ నాయకులు చిటికెన ప్రసాద్, సుచిత్ర రామి రెడ్డి, ఈశ్వరపు దాసి, ఫ్లెక్స్ రాజా, నిడదవోలు భాస్కర్ పాల్గొన్నారు.

# కొవ్వూరు నియోజకవర్గంలో పర్యాటక అభివృద్ధిపై సమగ్ర సమీక్ష





**కొవ్వూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 3:**రాబోయే పుష్కరాలకు తక్కువ సమయం మాత్రమే మిగిలి ఉండటంతో పర్యాటక అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని రెవెన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ఆర్డీవో రాణి సుస్మిత అధ్యక్షతన పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ పుష్కరాల నిర్వహణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో జిల్లాలోని సహజ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, పర్యాటక రంగాన్ని ఆదాయ వనరుగా తీర్చిదిద్దే దిశగా, ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. శాసన సభ్యులు సూచించిన మేరకు ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేసే అంశంపై ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అలాగే రాజమండ్రి తరహాలో వచ్చే పుష్కరాల సమయానికి కొవ్వూరు వైపు కూడా ఘాట్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించవలసి ఉందని తెలిపారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రతిపాదిత పనులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని పర్యాటక శాఖ అధికారులకు సూచనలు చేశారు. ప్రజలకు, పర్యాటకులకు ఉపయోగపడే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆయన అన్నారు. విజ్జేశ్వరం నుంచి తాడిపూడి వరకు కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో గోదావరి పరివాహక ప్రాంతం విస్తృతంగా ఉందని, ఈ ప్రాంతాన్ని పర్యాటక పరంగా అభివృద్ధి చేయడానికి మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ పనులకు సంబంధించి పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురంధరేశ్వరి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వారి సహకారంతో అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కుమారదేవం -- ఆరికరేవుల మధ్య గోదావరిలో ఉన్న లంక ప్రాంతంలో కూడా పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే ఆర్డీవో స్థాయిలో ప్రాథమిక ప్రతిపాదన సిద్ధం చేశామని, వాటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి డీపీఆర్ సిఫారసు చేయడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో టూరిజం ఆర్.డి ఎన్.వి.వి.ఎస్.మూర్తి, తూర్పు గోదావరి జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


# అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి





- బడ్జెట్ లో నిధులు పెంచాలి
- అంగన్వాడీల వేతనాల పెంపు, గ్రాట్యూటీ చట్టం అమలు చేయాలి
- అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ధర్నా

**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 3:** అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కే రాణి, నాగదేవి, వెంకయ్యమ్మ ,శిరీష ,లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. బడ్జెట్ 2026-27లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులకు వేతనాలు పెంచడంతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ధర్నా నిర్వహించారు.
అంగన్వాడీ ప్రాజెక్టులో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ధర్నా చేశారు .అనంతరం సిడిపిఓ సుచరిత ఆదిలక్ష్మి కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2026-27 కేంద్ర బడ్జెట్లో దేశవ్యాప్తంగా 26 లక్షల మంది అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌తో పాటు దాదాపు ఒక కోటి మంది స్కీమ్ వర్కర్ల దుస్థితి, హక్కులపై ప్రభుత్వం మౌనం పాటించడం తీవ్ర అన్యాయమన్నారు.ఐసీడీఎస్‌తో పాటు ఇతర స్కీమ్ వర్కర్లకు సంబంధించిన ప్రాథమిక సేవల పథకాలలో మౌలిక వసతులు, సేవల నాణ్యత మెరుగుపర్చేందుకు బడ్జెట్లో ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కేటాయింపుల్లో కూడా గణనీయమైన పెరుగుదల లేదన్నారు.కార్మిక చట్టాల ద్వారా అన్ని కార్మికులకు కనీస వేతనాలు అందిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, అంగన్వాడీ కార్యకర్తలకు నెలకు కేవలం రూ.2700, సహాయకులకు రూ.1350 మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2018 నుండి ఆహారం, ఆరోగ్యం, విద్య వంటి ప్రాథమిక సేవలను అందిస్తున్న ఈ గ్రాస్‌రూట్ స్థాయి కార్మికుల వేతనాలు ఇప్పటివరకు పెంచలేదన్నారు.స్కీమ్ కార్మికులకు సామాజిక భద్రత, పెన్షన్ లేవని, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులకు గ్రాట్యూటీ మంజూరు చేయాలని 2022లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని ఆరోపించారు. గ్రాట్యూటీ మంజూరు చేస్తున్నట్లు చెబుతున్నా, అందుకు తగిన బడ్జెట్ కేటాయింపులు లేవన్నారు.
2026-27 సంవత్సరానికి సక్షమ్ అంగన్వాడీ--పోషణ్ 2.0 పథకానికి రూ.23,100 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. గత సంవత్సరం కేటాయింపు రూ.21,960 కోట్లతో పోలిస్తే రూ.1,140 కోట్ల పెరుగుదల ఏమాత్రం సరిపోదన్నారు. దాదాపు 8 కోట్ల మంది పిల్లలు, 2 కోట్ల మంది గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు అనుబంధ పోషకాహారం అందించే ఈ పథకంలో వ్యయ నిబంధనలను 2017 తర్వాత ఒక్కసారి కూడా సవరించలేదని గుర్తు చేశారు.అంగన్వాడీ పథకం 2025లో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ, ఇప్పటికీ 3.38 లక్షలకు పైగా అంగన్వాడీ కేంద్రాలకు తాగునీరు లేకపోగా, 4.61 లక్షల కేంద్రాలకు మరుగుదొడ్ల సదుపాయం లేదన్నారు. 2022 బడ్జెట్లో ప్రకటించిన సాక్షమ్ అంగన్వాడీల నిర్మాణంలో ఇప్పటివరకు కేవలం సుమారు 60 వేల కేంద్రాలనే అభివృద్ధి చేశారని విమర్శించారు.కేంద్ర బడ్జెట్లో కార్మికుల గురించి, ముఖ్యంగా స్కీమ్ వర్కర్ల పని పరిస్థితులు మెరుగుపడేలా నిధులు పెంచాలని, అంగన్వాడీల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3, 2026న అఖిల భారత కమిటీ ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాష్ట్రంలో కూడా ఆందోళనలు కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన అంగన్వాడీ కార్యకర్తలు ,హెల్పర్లు పాల్గొన్నారు.

# మూలకు రిక్షాలు..నిధులు చెత్తపాలు





**ఏలూరు ఫిబ్రవరి3 పెన్ పవర్ :** చెత్త సేకరించి,ఎరువుగా మార్చి, పంచాయితీలకు ఆదాయ వనరులను అందించాలన్న లక్ష్యం నెరవేరడం లేదు.వెచ్చించిన నిధులు చెత్తపాలవుతున్నాయి.చెత్త సేకరణకు పంపిణీ చేసిన ఆటోలు,రిక్షాలు,తుప్పు పట్టి నిరుపయోగంగా మూలకు చేరాయి.దెందులూరు మండలంలోని ఆయా గ్రామాల పరిస్దితి.గత వైకాపా పాలనలో చెత్త సంపద కేంద్రాలను నిర్లక్ష్యంగా వదిలివేయడంతో దెందులూరు మండలం మేదినరావుపాలెం పంచాయితీలో చెత్త సేకరణకు వినియోగంచే వాహనాలు పని చేయకుండా ఇలా పడిఉన్నాయి.పస్తుతం ఆయా గ్రామాల్లో సంపద సృష్టి కేంద్రాలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించినా..
గ్రామ పంచాయితీలో కొన్ని వాహనాలు మాత్రం పనికి రాకుడా ఉండటంతో వాటిని గ్రామ సర్పంచ్ గామ ప్రజలు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పంచాయితీ నిధులు వెచ్చించి వాటిని వినియొగంలోకి తెచ్చి గ్రామంలో పారిశుధ్య సమస్యలు పరిష్కరించే వారు.గతంలో ప్రభుత్వం సమకూర్చిన వాహనాలు మాత్రం పంచాయితీ సిబ్బంది వినియోగంచకుండా పండల పరిషత్ స్కూల్‌లోను,
సంపదకేంద్రంలోను మూలన పడేశారు.అయినా అధికారులు చర్యలు తీసుకోలేదు.చెత్త ద్వారా సంపద సృష్టించి వచ్చిన ఆదాయంతో గ్రామంల మౌలిక సదుపాయాల వినియోగించుకునే లక్ష్యం నెరవేరడానికి ఆటంకంగా మారాయి.సంబందిత అధికారులు నిర్ణయం తీసుకుని వాటిని వాటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

# నేడు నెయ్యి కల్తీ అంశంపై, సిట్ (సీట్) చార్జ్‌షీట్‌కు విరుద్ధంగా నిరసనలు




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 03:**నెయ్యి కల్తీ అంశంపై, సిట్ (సీట్) చార్జ్‌షీట్‌కు విరుద్ధంగా, శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి , శ్రీ వై.వి. సుబ్బా రెడ్డి మరియు శ్రీ భూమన కరుణాకర్ రెడ్డి ఫోటోలతో తప్పుడు, అపవాదులు కలిగిన పోస్టర్లు ఏర్పాటు చేసి ప్రజల్లో శాంతిభద్రతలకు భంగం కలిగే విధంగా వాటిని సామాజిక మాద్యమాలలో ప్రచారం చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ రేపు అనగా 04.02.2026 బుధవారం ఉదయం 10.30ని.లకు తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసెదరు. కావున వైసీపీ నేతలు నాయకులు కార్యకర్తలు హాజరుకాగలరని కోరుతున్నా అని తెలిపారు.

# ముఖ్యమంత్రి హోదా లో చంద్రబాబు తప్పుడు రాజకీయాలు చేయడం తగదు

**వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభం**

**సెంట్రల్ జైల్లో మూలఖత్ లో అంబటిని కలిసిన ముద్రగడ చెల్లిబోయిన**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 3:** తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంలో సిబిఐ సిట్ నివేదిక వాస్తవాలకు అతీతంగా ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు తప్పుడు రాజకీయాలు చేయడం తగదని వైసిపి నాయకుడు, కాపు నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. చంద్రబాబును అసభ్యంగా దూషించిన వ్యవహారంలో కోర్టు రిమాండ్ విధించగా సెంట్రల్ జైల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబును మంగళవారం వైసీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి చెల్లిబోయిన వేణుగోపాలకృష్ణ తో కలిసి ముద్రగడ పద్మనాభం ములకెత్తిలో కలిశారు. అనంతరం ఆయన సెంట్రల్ జైలు బయట మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలో ఉన్న ప్రజలను తప్పుదోవ పట్టించే విధానాలు ఆ విధానాలు అవలంబించడం పరిపాటన్నారు. నిజానికి సిట్ నివేదిక బయటకు వచ్చిన తర్వాత తప్పు జరిగిందని చంద్రబాబు నాయుడు ప్రకటించి నట్లయితే ఆయనకు ప్రజల్లో గౌరవం పెరిగేదన్నారు. అలా కాకుండా మాజీ మంత్రి అంబటి రాంబాబును కుటమి పార్టీ నాయకుల రౌడీల చేత బూతులు
తీట్టించడం, ఇంటి మీద దాడులు చేయించి దహనం చేయడం రాష్ట్రంలో అరాచక పాలనకు నిదర్శనం అన్నారు. జిల్లా వైసీపీ అధ్యక్షుడు చెల్లిబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బ తినే విధంగా తిరుమల లడ్డు తయారీలో జంతువు కొవ్వు కలవలేదని సిట్ నివేదిక ఇచ్చిందని, అయితే దేశంలో పదార్థాల కల్తీ పెద్ద ఫ్యాక్టరీగా నడుస్తుందని అన్నారు. లడ్డు కల్తీలో తిరుమల పాలన అధికారులు, టిటిడి చైర్మన్గ లుగా పనిచేసిన వారికి సంబంధం లేదని ఈ వ్యవహారమంతా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే బయటపడిందన్నారు. జగన్ కు ఈ ఈ కలంకాన్ని అంటకట్టాలని చంద్రబాబు నాయుడు ఆ దేవదేవుని రాజకీయాల్లోకి లాగి అసత్య ప్రసారం చేస్తున్నారని విమర్శించారు. వీరి వెంట జక్కంపూడి రాజా తదితరులు పాల్గొన్నారు.

## ధవళేశ్వరం అభివృద్ధికి రూ.6 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు

**ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, ఫిబ్రవరి 3:**రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా నిబద్ధతతో పనిచేస్తోందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పష్టం చేశారు. శానిటేషన్ , రహదారులు, డ్రెయిన్లు, మార్కెట్ వసతులపై దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. మంగళవారం ధవళేశ్వరం గ్రామంలో గవర్నమెంట్ హాస్పిటల్ ప్రక్కన రైతు బజార్ నిర్మాణానికి, కొత్తపేట, కాటన్‌పేట ప్రాంతాలలో నూతన సీసీ డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, ధవళేశ్వరం గ్రామస్థుల చిరకాల వాంఛ అయిన రైతు బజార్‌ను సాకారం చేయాలనే ఉద్దేశంతో గతంలో రూ.9 లక్షలతో పనులు ప్రారంభించినప్పటికీ, గత ప్రభుత్వం హయాంలో పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి గుర్తు చేశారు. ప్రస్తుతం మరో రూ.46 లక్షలు మంజూరు చేసి, మొత్తం రూ.55 లక్షల వ్యయంతో రైతు బజార్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద సిమెంట్ రోడ్లు వేసి, రైతులకు షాపులు ఏర్పాట చేస్తామన్నారు. త్వరలో అన్నా క్యాంటీన్‌ఏర్పాటు చేస్తామని చెప్పారు. నమశ్శివాయ పంచాయతీ అభివృద్ధికి పన్నుల చెల్లింపు ఎంతో కీలకమని, సుమారు రూ.6 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక సంస్థల ఉద్యోగులు పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో జీతాల చెల్లింపులో ఇబ్బందులు ఎదురవుతాయని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ఉన్నట్లు వివరించారు. రూరల్ నియోజకవర్గంలో మొత్తం సుమారు రూ.35 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయన్నారు.
గ్రామంలో అంతర్గత డ్రెయిన్ల నిర్మాణానికి రూ.94 లక్షల గ్రాంట్ తీసుకువచ్చినట్లు బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆవ చానల్ ప్రధాన కాలువతో అనుసంధానం చేసే పనులు కోటిన్నర రూపాయలతో చేపడుతున్నామని, త్వరలో మరో కోటి రూపాయలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి కాలువలు, రహదారుల అభివృద్ధి పనులు పూర్తిచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు .300--400 కోట్ల రూపాయల ప్రాజెక్ట్ కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. ధవళేశ్వరం ప్రధాన రహదారిని వెడల్పు చేసి అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆక్రమణలు తొలగించడంలో సహకరించాలని పిలుపు నిచ్చారు. టిడ్కో గృహాల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రూ.86 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం, రూ.2.50 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులు, రూ.55 లక్షలతో రైతు బజార్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. మార్కెట్ అభివృద్ధికి మరో కోటి రూపాయల ప్రతిపాదనపై గ్రామస్థులు, స్థానిక నాయకులు చేసిన విజ్ఞప్తికి , ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని ఎమ్మెల్యే గోరంట్ల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో ఆర్మ్ స్ట్రాంగ్, మార్కెటింగ్ సహాయ సంచాలకులు ఎం. సునీల్ వినయ్ , ఏ.ఎం.సీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పండూరి అప్పారావు, ఎ.ఎం.సి వైస్ చైర్మన్ బోడపాటి గోపి, నియోజకవర్గ పరిశీలకులు డొక్కా నాథ్ బాబు, రాష్ట్ర రైతు నాయకులు అన్నదేవుల చంటి, పుక్కళ్ళ రాజు, అళ్ళ ఆనందరావు, యడ్ల మహేష్, భీరా ప్రకాష్, యడ్ల వెంకటేష్, ఒంటెద్దు స్వామి, సావాడ శ్రీనివాస్ రెడ్డి, పొన్నాల లక్ష్మి సంతోషి, షేక్ అమీనా బేగం, బొప్పన నాగేశ్వరరావు, బైరెత్తి సరోజినీ దేవి, వర్రె రాజేష్, సాజిత్, గ్రంధి వెంకయ్య, బండి గోపి, పంచాయతీ కార్యదర్శి వెంకటరావు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షల కోసం మట్టి నమూనాల సేకరణ






**వై రామవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 3 :** గిరిజన రైతులు తమ పొలాలలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షల నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ సావిత్రి అన్నారు.
అడ్డతీగల డివిజన్ వైరామవరం మండలం చవిటి దిబ్బలు రైతు శిక్షణ కేంద్రంలో డి ఎల్ ఎం పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మట్టి శాంపుల్ కలెక్షన్ పై రైతులుగా అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. మట్టి నమూనాలు పరీక్షలు ఎందుకు, ఎలా చేయించాలని అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. పొలంలో ఏ ఏ ప్రదేశాలలో మట్టి నమూనాలు సేకరించాలని, ఎలాంటి ప్రదేశాలలో సేకరించకూడదో అదేవిధంగా జీడి మామిడి తోటలలో ఏ విధంగా చేయాలో రైతులకు వివరించడం జరిగిందని తెలిపారు. గ్రామంలో చిక్కుడు వెంకటలక్ష్మి పొలంలో మట్టి నమూనాలు సేకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ స్టాఫ్, ఏపీ సిఎన్ ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అంగన్వాడి న్యాయమైన సమస్యలువెంటనే పరిష్కరణ చేయాలి..




**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి02:** స్థానిక మండల కేంద్రం అడ్డతీగల ఐసిడిఎస్ ఆఫీసు ఆవరణలో అడ్డతీగల, వై. రామవరం మండలాలకు చెందిన అంగన్వాడి వర్కర్స్ మరియు హెల్పర్స్ భారీ స్థాయిలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సి.ఐ.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నిర్మల హాజరయ్యారు. ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జి. బేబీ రాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడి వర్కర్స్ న్యాయమైన సమస్యలను వెంటనే నెరవేర్చాలని,ఐ.సి.డి.ఎస్ కు బడ్జెట్ విడుదల చేయాలని, బడ్జెట్ విడుదల చేయడంలో ఐ.సి.డి.ఎస్ కు తీవ్ర అన్యాయం జరుగుతుందని, బడ్జెట్ పత్రాలను యూనియన్ నాయకులు కాల్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కే. లక్ష్మి, కోశాధికారి జీ. పార్వతి, సెక్టర్ లీడర్స్ కే. అమ్మాజీ. కే. రామలక్ష్మి, కే.బుల్లెమ్మ, చంద్రకళ, విజయ మొదలగువారు పాల్గొన్నారు.

# వారపు సంతలో నిబంధనలు పాటించండి పంచాయతీ అధికారులు...

**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి02**: అడ్డతీగల మంగళవారం వారపు సంత కావడంతో, వ్యాపారస్తులు వారికి కేటాయించిన షెడ్ లో కాకుండా, మార్కెట్లో ఉన్నటువంటి రోడ్డుపై వ్యాపారాలు సాగిస్తున్న వ్యాపారులకు పంచాయతీ అధికారులు వారికి కేటాయించిన షెడ్లలో మాత్రమే వారి వ్యాపారం చేసుకోవాలని, అంతేకానీ వారి ముందున్న రోడ్లపై ఎటువంటి సామాగ్రి పెట్టవద్దని, ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని, దీనివల్ల వారపు సంతకు వచ్చే వారికి ఇబ్బంది కలిగించవద్దని వ్యాపారస్తులకు పంచాయతీ అధికారులు తెలియజేశారు. ఎవరైనా వ్యాపారస్తులు తమ కేటాయించిన షెడ్యూల్లో కాకుండా రోడ్లపై వ్యాపారం సాగిస్తే,చర్యలు తప్పవని వ్యాపారస్తులకు అధికారులు తెలియజేశారు. వారపు సంతలో ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని దానివలన పర్యావరణానికి చేటు అని అవగాహన కల్పించారు.




## ప్రభుత్వ వ్యతిరేక విధానాలు మేరకు నిరసన.

**అల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ పిలుపు తో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్**



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 03.**అల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ పిలుపు తో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆదేశాలు మేరకు ప్రభుత్వ వ్యతిరేక విధానాలు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు ఇందులో ప్రధాన డిమాండ్లు

1) 8వ పే కమీషన్ 01.01.2026 నుండి అమలుపరచాలి.
2)నైట్ పెట్రోల్ డ్యూటీ కి ఇద్దరు ని నియమించాలి.
3)రిస్క్ అలౌవెన్స్ అన్ని భద్రత డిపార్టుమెంటు వర్తించాలి.
4) గ్రేడ్ 1 ఒ2 మెర్జ్ చెయ్యాలి
5)ట్రాక్ మైంటెనర్ కు 4200/-గ్రేడ్ పే ఇవ్వాలి.
6)డైరెక్ట్ రిక్యూట్మెంట్ లో 10 శాతం పోస్టులు ఎల్ డి సి ఇ కి కేటాయించి అందరికి అవకాశం కల్పించాలి.
7)సర్వీస్ లో ఉన్న ఎంప్లాయిస్ వాళ్ళ తల్లి తండ్రులు లకు ప్రైవిలేజ్ పాస్ లో అవకాశం కల్పించాలి.

పై కోరికలు నెరవేరేదాకా ఎస్ ఆర్ ఎంతటి పోరాటం కైనా సిద్ధం అని తెలియజేసారు అవసరం ఐతే రైల్వకార్మికుల స్ట్రైక్ కి కూడా సిద్ధం అని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో తాడేపల్లిగూడెం బ్రాంచ్ సెక్రటరీ జి. దానయ్య చైర్మన్ కేవీర్ కుమార్ కోశాధికారి సీహెచ్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది

## రెండు ప్రధాన రహదారులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 3:**రూరల్ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.7 కోట్ల నిధులతో విస్తృత పనులు చేపడుతున్నామని, ఈ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. బాలాజీ పేట బొమ్మూరు నుంచి రాజవోలు శివారు వరకు రూ.3.5 కోట్లతో నూతనంగా నిర్మించనున్న సిసి , బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఎన్‌హెచ్--5 నుంచి పాత బొమ్మూరు వరకు (పోలీస్ క్వార్టర్స్, పిడింగొయ్యి, కవలగొయ్యి, బుచ్చయ్య నగర్, పిట్టలవాని చెరువు, శాటిలైట్ సిటీ ఏ.బి.సి బ్లాకులు, హుకుంపేట పంచాయతీ డి బ్లాక్, పాత బొమ్మూరు) ప్రాంతాల మీదుగా రూ.3.5 కోట్లతో నూతనంగా నిర్మించనున్న సిసి--బీటీ రోడ్డుకు కూడా శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రహదారులు భవనాలు శాఖ రెండు ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తాడితోట జంక్షన్ నుంచి బొమ్మూరు జంక్షన్ వరకు రోడ్డును నిర్మిస్తున్నామని చెప్పారు. బొమ్మూరు జంక్షన్ వద్ద ఉన్న చెరువుపై ఆక్రమణలను తొలగించి కంబాల చెరువు తరహాలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్ నాయకులు ప్రసాద్, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పండూరి అప్పారావు, పిల్లా తనుజ, కామిని భాస్కర్, భీమరశెట్టి రమేష్, కామిని ప్రసాద్, కోళ్ళ సత్తిబాబు, ఎమ్మెస్సార్ శ్రీను, ఏడాకుల వెంకటేశ్వరరావు, చలమూరి సత్యనారాయణ, వాసుపల్లి అనంతలక్ష్మి, మంద హిమబిందు, యలమాటి రామకృష్ణ, బైరుత్తి సరోజినీ దేవి, కోటిపల్లి అమ్ములు, వెంకటలక్ష్మి, జ్యోతి, పెంకే కోటేశ్వరరావు, దారా అన్నవరం, ఎర్ర రాంబాబు, గుడిసిపూడి నాగేంద్ర, చౌడాడ సునీల్, గెద్దాడ కృష్ణ, ఆరబి డీఈ ఎం. మను, జేఈ సిద్ధార్థ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కైకరంలోని శ్రీ సుందర సీతారామస్వామి కళింగ రామాలయానికి నూతన కమిటీ నియామకం



**పెన్ పవర్ ఉంగుటూరు, ఫిబ్రవరి 3:**ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలోని శ్రీ సుందర సీతారామస్వామి కళింగ రామాలయంలో నూతన కమిటీ నియామక ప్రక్రియ ఆలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆలయ అభివృద్ధి, భక్తుల సేవ, సనాతన ధర్మ పరిరక్షణ లక్ష్యంగా పనిచేస్తామని సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.
నామినేషన్లను ఆహ్వానించగా మొత్తం 30 మంది సభ్యులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అనంతరం సభ్యుల ఏకగ్రీవ నిర్ణయంతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.
నూతన కమిటీ వివరాలు ఇలా ఉన్నాయి:
గౌరవ అధ్యక్షులు: ఎండ రామదాసు
అధ్యక్షులు: చింతాడ రంగారావు
కన్వీనర్లు: కూన అప్పారావు, కేంగం వీర్రాజు
కోశాధికారి: పేడ్డ ఎస్.కే.ఎన్.వి. ప్రకాష్
గౌరవ సలహాదారులు: అనిపెద్ది యజ్ఞవల్క్య లక్ష్మీకాంతరావు, కొచ్చర్లకోట శ్రీనివాస్, జటావలబుల సాయిరాం
అర్చక స్వాములు: అఖండం భాస్కర సత్య వెంకట రామయ్య, నూతలపాటి దుర్గాదేవి
అదేవిధంగా 19 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వీరిలో ఐదుగురు మహిళలు కార్యవర్గ సభ్యులుగా ఎన్నిక కావడం విశేషంగా నిలిచింది. నూతన కమిటీ సభ్యులతో గౌరవ సలహాదారు కొచ్చర్లకోట శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని, ప్రతి వారం ఆలయాన్ని సందర్శిస్తూ భక్తులకు సేవలందిస్తామని, సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రమాణం చేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

